# సింగిల్ పేజీ కథలు

## గట్టి మనసు

"మనం చాలాకాలంగా కలిసి తిరుగుతున్నాం. మనిద్దరి అభిరుచులు, అభిప్రాయాలూ దాదాపుగా కలిశాయి. మనం పెళ్లి చేసుకుందాం ఇందిరా" అన్నాడు వేణు న్యూజెర్సీలోని ఇండియన్ రెస్టారెంట్‌లో డిన్నరు చేస్తూ. అతని ప్రపోజల్ వినగానే ఆల్చిప్పల్లాంటి ఇందిర కళ్లు తళుక్కుమన్నాయి. సన్నని పెదవుల మీద చిరునవ్వు మెరిసింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి.

"ఏమిటాలోచిస్తున్నావు ఇందిరా?" అడిగాడు ఆత్రుతగా.

"మనం ఒకరి గురించి ఒకరం తెలుసుకున్నాం. కానీ కుటుంబాల గురించి ఏమీ మాట్లాడుకోలేదు కదూ!"

"మనం ఒకరినొకరం నచ్చుకొని పెళ్లి చేసుకుంటున్నప్పుడు కుటుంబాల ప్రసక్తి ఎందుకు?" అన్నాడు.

"పెళ్లంటే లైఫ్‌లాంగ్ కమిట్‌మెంటు కదా వేణూ! కుటుంబాల గురించి తెలుసుకోవటం, దూరంగా ఉంటున్నా వాళ్లతో చెప్పి ముందుకు వెళ్లటం అవసరమని నా ఉద్దేశం" అంది ఇందిర.

"సరే! నాకు మాత్రం ఎవరికీ ఏమీ చెప్పవలసిన అవసరం లేదు" అన్నాడు.

"అంటే నీకెవరూ లేరా?" అని ప్రశ్నించింది లోలోపల అతను ఒంటరివాడని జాలిపడుతూ.

"ఉన్నారు. కానీ నేను వాళ్లతో కనెక్షను కట్ చేసుకున్నాను"

"ఎందుకని వేణూ?" అని అడిగింది ఆశ్చర్యపడింది.

"మా అమ్మ, నాన్న పెద్దగా చదువుకోలేదు. పల్లెటూళ్లో వ్యవసాయం చేస్తారు. నాకొక తమ్ముడు, చెల్లి ఉన్నారు. నేను రెసిడెన్షియల్ స్కూల్లో చేరినప్పటినుంచి ఇంటిదగ్గర గడిపిన కాలం చాలా తక్కువ. అప్పుడు కూడా నాకెవరితో కలవాలనిపించక పుస్తకాలు చదువుకుంటూ, రేడియో వింటూ గడిపేవాడిని. సెలవులు ఎప్పుడైపోతాయా అని ఎదురుచూస్తూ ఉండేవాడిని. ఇంజనీరింగు పూర్తయ్యాక మావాళ్లు అక్కడే ఉద్యోగం చేయమన్నారు. కానీ నాకు ఇండియాలో ఉండటం ఇష్టం లేదని చెప్పేను. నా పట్టుదల చూసి కొంత పొలం అమ్మేసి డబ్బు ఇచ్చేరు. నేనిక్కడికి వచ్చి స్థిరపడ్డాక ఆ డబ్బు పంపించి చేతులు దులుపుకున్నాను."

"నువ్విక్కడికి వచ్చి పదేళ్లకు పైగా అయిందన్నావు కదా! మీ వాళ్లను చూడాలని ఒక్కసారి కూడా అనిపించలేదా?"

"లేదు."

"అబ్బ! గట్టి మనసే" అంది ఇందిర.

"మెత్తగా ఉంటే నెత్తిన రుద్దిన బాధ్యతలతో సతమతమవుతూ ఉండాల్సివచ్చేది. తెచ్చే పెళ్లి సంబంధాల్లో ఏదో ఒకటి నచ్చుకోమని ఒత్తిడి చేస్తూ విసిగిస్తూ ఉండేవారు. ఇప్పుడలాంటి ఇబ్బందులేమీ లేకుండా హాయిగా ఉన్నాను."

"ఈ విషయంలో నేను నీకు పూర్తిగా వ్యతిరేకం. వారానికొకసారి మా వాళ్ల గొంతులు వినకపోతే పనిమీదకు దృష్టి వెళ్లదు. రెండేళ్లకొకసారి వెళ్లి నా వాళ్లందరితో గడపకపోతే ఉద్యోగంలోకి ఉత్సాహంగా వెళ్లలేను" అంది ఇందిర.

"మీవాళ్లెక్కడుంటున్నారు?"

"మా నాన్న జిల్లాపరిషత్ స్కూలులో పనిచేసి రిటైరైన తరువాత పల్లెటూరులోనే స్థిరపడ్డారు. అక్క, బావ టీచర్లు. మా అన్నయ్య గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. నా ఇష్టప్రకారం ఇంజనీరింగు చదివించారు. ఒంటరిగా ఇక్కడికి పంపించటానికి భయపడ్డారు. కానీ నా ఫ్రెండ్స్ చాలామంది వస్తున్నారని తెలిసి ఒప్పుకున్నారు. ఇక్కడికి వచ్చిన కొత్తలో హోంసిక్‌నెస్ విపరీతంగా ఉండేది. తిరిగి వెళ్లిపోవాలనిపించేది. కానీ పై చదువు మీదున్న ఆసక్తి, ఫ్యూచర్ మీదున్న ఆశలు, ఇక్కడున్న సౌకర్యాలు నన్ను కట్టిపడేశాయి."

"నీ కట్టూ బొట్టూ అన్నీ మారేయి కదా! మీ ఊళ్లో అందరూ నిన్ను వింతగా చూడరా? అసలా పల్లెటూళ్లో నీకెలాగ తోస్తుంది? సౌకర్యాలు కూడా సరిగా ఉండవే" అన్నాడు వేణు.

"కట్టూ బొట్టూ మారినా, జుట్టు కట్ చేసుకున్నా వాళ్లతో కనెక్షన్ కట్ చేసుకోలేదు. అందుకే మా వాళ్లకే కాకుండా ఊళ్లోవాళ్లకు కూడా నేనంటే ప్రాణం. వాళ్లందరి మధ్య ఉన్నప్పుడు సౌకర్యాలు సరిగా లేవనే సంగతి గుర్తుకురానంత వేగంగా రోజులు గడిచిపోతాయి."

"కుటుంబాల గురించి తెలుసుకోవటం కూడా అయింది కదా? పెళ్లికి ఏర్పాట్లు చేసుకుందామా?" అని అడిగాడు వేణు రసమలై తింటూ. ఆర్నెల్లుగా కలసి తిరుగుతున్నా చిటికెనవేలు కూడా తగలనివ్వకుండా జాగ్రత్త పడుతున్న ఇందిర మీద ఆకర్షణ క్షణక్షణానికి పెరిగిపోతూంది. బంగారు తీగలాంటి ఇందిరను చేతుల్తో చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చెయ్యాలని వేగిరపడుతున్న మనస్సును అతికష్టం మీద అదుపులో పెడుతున్నాడు.

"మా వాళ్లతో చెప్పకుండా ఇంతవరకు నేనే పనీ చేయలేదు వేణూ! అతి ముఖ్యమైన పెళ్లి విషయం చెప్పకుండా ఎలా ముందుకు వెళ్లగలను?" అంది ఇందిర.

"రేపు శనివారం కదా! మాట్లాడు. వచ్చేవారం పెళ్లి చేసేసుకుందాం" అతని తొందర చూసి ఆమె నవ్వింది.

"చెప్పేదాన్నే. కానీ మా వాళ్లంతా బంధువులింట్లో పెళ్లికి ఊరికి వెళ్లాలని కిందటి వారం చెప్పారు. వారం రోజుల తరువాత రాగానే ఫోను చేస్తాను. సరేనా?" అంది లాలనగా.

"అబ్బ! ఇంకా ఏడు రోజులా? నాకేమో ఏడు యుగాలనిపిస్తుంది ఇందిరా" అన్నాడు ఆలస్యం భరించలేనట్లు.

"నాకు మాత్రం తొందర లేదా వేణూ! కానీ ఏడడుగులు నడవాలంటే ఏడు రోజులు ఆగక తప్పదు" అంది ఇందిర. ఇద్దరూ డిన్నరు తరువాత బైటకు నడిచారు.

* * *

సరిగ్గా ఎనిమిదోరోజు ఉదయం ఫోను మ్రోగింది. ఒక్క గెంతులో వెళ్లి ఫోనందుకున్నాడు వేణు.

"హలో! వేణు హియర్" అన్నాడు.

"గుడ్‌మార్నింగ్ వేణూ! ఇందిరని"

"మీవాళ్లతో మాట్లాడేవా ఇందిరా?" అని అగాడు ఆత్రుతగా.

"నిన్న రాత్రే మాట్లాడేను వేణూ! నా నిర్ణయాన్ని వాళ్లు కాదనమని చెప్పేరు."

"అయితే మనం వెంటనే కలుసుకొని పెళ్లి ఏర్పాట్ల గురించి మాట్లాడుకుందామా?"

"సారీ వేణూ!"

అదిరిపడ్డాడు వేణు.

"గుడ్‌న్యూస్ చెప్పాక సారీ చెప్తున్నావేం ఇందిరా?"

"నేను నిన్ను పెళ్లి చేసుకోలేను వేణూ"

హతాశుడైనాడు వేణు.

"నేను ప్రపోజ్ చేసినప్పుడు నువ్వు కాదనలేదే! ఇంతలో మనసెందుకు మార్చుకున్నావు?" అతని గొంతులో ఆశాభంగం, కోపం పోటీలు పడ్డాయి.

"మనం కుటుంబాల గురించి మాట్లాడుకోక ముందు నేను మనస్ఫూర్తిగానే ఇష్టపడ్డాను. కానీ స్వార్థంతో, కని పెంచి నువ్వింతవాడివి కావటానికి శ్రమించిన తల్లిదండ్రులతోను, రక్తం పంచుకొని పుట్టిన తోబుట్టువులతోను కనెక్షను కట్ చేసుకున్నావు. స్వార్థానికి తప్ప ప్రేమకు, ఆప్యాయతకు నీ మనస్సులో చోటులేదు. అంచేత భవిష్యత్తులో నువ్వు భార్యతో కూడా కనెక్షను కట్ చేసుకోకుండా ఉంటావనే గ్యారంటీ ఏమీలేదు. గుడ్ బై!"

**-జి.సరస్వతి** (బెంగుళూరు)